

# జీవనయానం

ఆనాటి పయనం ఎట్లా ఉంటుందో అని బిక్కుబిక్కుమంటూ ఎఱ్ఱమొగంతో అప్పుడే తొంగిచూస్తున్నాడు సూర్యభగవానుడు. ఆరుబయట పడవేసిన మంచంమీదనుంచి ఆవలిస్తూ లేస్తూ ఆ రోజు చేయవలసిన పనులన్నీ నెమరువేసుకుని దినం ఎలా గడుస్తుందా అనుకుంటూ ఆలోచనాభారంతో రాత్రంతా అలసిపోయిన ముఖాన్ని కడుక్కోవటానికి పోయాను. నాలో కలిగిన ఉద్రేకం, ముఖంమీద వేలాడుతున్న అలసట బాపతు ఆలోచనలన్నీ కడుక్కునిపోయాయి. నాలోని విలక్షణాలను, దుస్తులతో కప్పుకుని విశాల ప్రపంచంలోకి అడుగుపెట్టాను నాలో మిగిలివున్న ఉద్రేకాన్ని బయలుపెట్టుకుందామని. తన తేజస్సును కప్పిపుచ్చుతున్న మంచుపొరలను గాలిలో కలిపేసి, విలయతాండవానికి ఉద్యుక్తుడవుతున్నాడు మార్తాండుడు.

ముద్రితమైన లోహపుముక్కల వ్యయం గతించిన దినమే గతించటం చేత వీధి కుళాయినీటిని నా కడుపునిండా నింపుకుని నా ఆశలన్నీ దానిలో నిబిడీకృతం చేసుకున్నాను. వ్యయపు వివరం అవసరంలేని వాయువును హృదయకుహరాల నిండా నింపుకుని బ్రేవుమని నిట్టూర్చాను. పైకి పాకుతున్న అరుణకిరణాలు చీకటితెరలను తరిమివేస్తున్నాయి. ప్రపంచంలోని చీకటంతా పటాపంచలయిపోయినా నా పక్కనే ఉన్న ఛాయమాత్రం నిలకడగా నన్నంటిపెట్టుకునే ఉన్నది. నాతోనే వస్తానంటున్నది. నా అనుమతితో నిమిత్తం లేకుండానే నా ఊహాపథంలో నృత్యంచేస్తున్న సంశయబాలలను నాలోని చైతన్యంతో పారద్రోలుతున్నా నా అస్థిత్వాన్ని అంటిబెట్టుకుని అపజయం అనే సంశయం హృదయపీఠికపైన ఛాయామాత్రంగా నిలబడే ఉంది.

వీధిలో అడుగుపెట్టగానే ప్రధమంగా కనపడింది ఒక వాహనం. అది నడవటానికి తైలం కావాలి. నేను నడవటానికి నేనే ఉన్నాను. ఆ వాహనాన్ని సమీపించి దాన్ని నడిపే జీవచ్ఛవాన్ని వెళ్ళి అడిగాను "నా గమ్యస్థానానికి చేరుస్తావా" అని. అగమ్యగోచరంగా నావంక చూచి "నీకూ ఒక గమ్యస్థానం ఉందా?" అన్నాడు. నాకు తెలుసు గమ్యస్థానం అనే పదం మా ఇద్దరి జీవిత నిఘంటువులలోనుంచి తొలగింపబడి చాలా కాలం అయి, ఈనాటికి మరి కొద్దికాలం గూడా అవస్తున్నదని. గాలిలోకి బాణాలు వదిలిపెట్టటం వలన నా వింటిత్రాడు నష్టపడుతుందన్న విషయం ఈనాడు గుర్తించింది కాదు. అతనివంక తీవ్రంగా చూచి అనుకున్నాను "నన్నూ ఈ తైల యంత్రాలను తోలే పనిలో ప్రవేశపెట్టివుండినట్లయితే నా బ్రతుకును జీవచ్ఛవంలాగానైనా నడిపించుకుపోయేవాడిని గదా!" అని. నా మీద శిదిలమైన ఆలోచనల తాలూకు ధూళిని దులుపుకుంటూ జీవచ్ఛవం వెళ్లిపోయింది ఇందాకటి వాహనం మీద. ఆ ధూళి హృదయకుహరాలలోకి పోయి సంశయపు నీడలను వ్యాకోచం చెందిస్తున్నదన్న సందేహంచేత నాసికా రంధ్రాలమీద ఆచ్ఛాదనం ఉంచుకుని శిరసు పైకెత్తి నా స్నేహితునివంక చూశాను. సహస్రకిరణుడు అన్ని కిరణాలను నా మీదనే కేంద్రీకరించి ఉగ్రరూపంలో దర్శనమిచ్చాడు. నా బాదకి సానుభూతి చూపలేని కృతఘ్నమిత్రుని వంక చూడటానికి మనసొప్పక తలవాల్చాను. పొడుగాటి నా నీడ నా సంశయాల పరిమాణాన్ని ఎత్తిచూపుతూ నా దగ్గిరే ఉంది.

సూర్యునికీ నాకూ మధ్యనున్న అంతరాన్ని సూచనప్రాయంగా ప్రస్ఫుటం చేస్తూ లోహవిహంగం ఒకటి నా శిరంపై గుండా గాలిని కోసుకుంటూ పోతున్నది దానిలో గూడా నాబోటి ద్విపాద పశువులు ఉండి ఉంటాయి. లోహవిహంగాలను ఎగురవేసే విద్య నాకు నేర్పించి ఉన్నట్లయితే నేను గాలిలో తేలిపోయేవాడిని గదూ! ఇప్పుడు గాలిలోనే ఉన్న ఆలోచనలు అంతకుమించి పైకి పోలేక అక్కడే స్థంభించిపోతాయి నా జీవనరాగంలో శ్రుతులన్నీ పలకవు ఆనాడు తీగలు లేని నా హృదయవీణ గాలిచప్పుడుకు శ్రుతి కలిపి రోదనం చేస్తుంది కాబోలు... విద్యానిలయాల్లో పట్టభద్రులను పటకాలతో తయారుచేసి నిజపదభ్రష్టులను గావించకపోతే ఉన్న నిజాన్ని నిలవనివ్వగూడదూ! అజ్ఞానపు పొరలను తొలగించే పేరుతో అంతకంటె మందమైన విజ్ఞానపు పొరలు తగిలించి అంధకారబంధురం చెయ్యటం ఎందుకు? నా సంశయాలు పెట్టే బాధ, గాలిలో ఇనుపగద్దలమీద విహారం చేసేవారి సుఖానికి పోల్చుకుని క్రుంగిపోతోంది. నాబాధని ఇనుమడింపవలసిందిగా నా హృదయం ఎవరిని పిలిచి అడిగింది? నా పొడుగాటి నీడ నా సంశయపు లోతులను గుర్తుచేస్తూ భయపెట్టుతూనే ఉంది.

'ఉద్యోగం పురుషలక్షణం' అన్న సూక్తిని మనఃఫలకంలోనుంచి వెలుపలికి లాగి పురుషపదం తొలిగించి 'సమర్థలక్షణం' అని మార్చుకున్నాను, నా అసమర్థతను బహిరంగం చేసుకుందామని. చేతకానితనం చేతులెత్తి లాస్యవిన్యాసం చేస్తూంటే సంశయాలన్నీ హృదయపీఠంనుంచి దిగివచ్చి విన్యాసానికి కళాదృష్ట్యా సాయపడుతున్నాయి. ఖాళీచెయ్యబడ్డ నా తెలివితేటల కొంప అలాగే శూన్యంగా ఉండిపోయింది. దానిలో ఆలోచనా శక్తులను ప్రవేశపెట్టాలనే తెలివితేటలు గూడా తట్టకపోవటంవలన 'ఉద్యోగాలు ఖాళీలేవు' అంటూ వాకిట నిలబడి ఘోషిస్తున్న కొయ్యపలకను అపార్థం చేసుకున్న నేను లోపలకు పోయి 'మీరు ఏం కోరి ఇటు ఏతెంచారు' అంటూ అటు వచ్చిన యజమాని ప్రశ్నను పదే పదే స్మరించుకుని ప్రశ్ననర్థం చేసుకోగల స్తోమత లేక, దానికి సమాధానమీయగల ఆలోచనావ్యక్తులు తెలివితేటల కొంపను ఖాళీచేసిన సమయం గతించటం వలన ఆలోచనారహితంగా వాకిట అడుగుపెట్టాను. నాకిప్పుడు ఏ సంశయమూ లేదు... ఎందుకంటే. . ఎటువంటి ప్రశ్న నాలో ఉదయించటం లేదు గాబట్టి. నా

సహాధ్యాయునికోసం నాలుగువైపులా వెతుక్కున్నాను. సూర్య తాపానికి తాళలేక నా కాళ్ళకింద అలసట తీర్చుకుంటోంది నా పిరికి నీడ.

గతించిన దినమంతా గతం కాబోయే భాగాన్ని వెక్కిరిస్తూ వెనక్కుపోతోంది. వెనక్కు నడిచినా ముందుకు నడిచినా లేని గమ్యస్థానం నాకు ఒకే దూరంలో ఉంటుంది. తెలిసిన బాట కాబట్టి అడుగు వెనక్కు ప్రారంభించాను. నా దృక్పథంలోకి వస్తున్న ప్రతి వస్తువులోనూ నాబోటి జీవం కనబడుతూనే ఉంది. నాలోని ఆలోచనలకు పదునుపెట్టి ఆ ప్రత్యేకపు పనిలో ప్రవేశపెట్టినట్లయితే నేనుచెయ్యలేని పని ఒక్కటీ లేదు. నేను నేర్చుకుని అనుభవంలోకి తీసుకురాలేని విచిత్రపరికరం ఎక్కడా కనిపించడం లేదు. తెరమీద బొమ్మలను చూపించగలను. బొమ్మలు చూపించే పరికరాన్ని నా చేతులతో సునిశితంగా సృష్టించగలను. మహోదధులను దాటివేయగల పెద్ద పడవలను నిర్మించగలను. నా ఇల్లు కట్టుకోగల స్తోమత నాలో ఉన్నది. అన్నీ ఉన్నాయి. అవకాశం లేదు. ఆధారం లేదు. నా ఊహాసౌధాలను నిర్మించుకోవటానికి నా ఆశయపు ఇటుకలున్నాయి. వాటిని చేర్పించటానికి కావలసిన సున్నం కావలసివస్తూనే ఉన్నది. ఆశయం లేని ఆలోచనలు సున్నం లేని ఇటుకల్లా పడి విరిగిపోతున్నాయి. ఆలోచనలు పెరుగుతున్నాయి. నా కాలికింది నీడ నిర్భయంగా ప్రాగ్దిశకు పాకుతోంది. పశ్చిమంలోని సముద్రం సూర్యుణ్ణి మ్రింగటానికి ఆకలిగొన్న సర్పంలా వేయి నాలుకలను పైకెగరవేస్తున్నది.

నా కాళ్ళకు చెప్పిన బుద్ధి వాటిలో జీర్ణించుకుపోయింది. అలవాటుపడ్డ నా కాళ్ళ గుర్రం నడవటానికి మొండికేస్తున్నది. ఆలోచనలను అనంతంగా అరిగించుకోవటం వలన దుష్ఫలితాన్ని అనుభవిస్తున్న నా అజీర్ణపు మెదడు మందంగా నిలబడిపోయింది. ఆలోచనలన్నీ స్తంభించిపోతున్నాయి. నా ఆలోచనలతో పాటు పెరిగిన నా ఛాయ ప్రాగ్దిశకు ప్రాకిపోయింది. తన తల్లి చీకటినుండి విడతీసిన దుష్టుడు సముద్రగర్భంలో పడి అంతర్ధానమవుతున్నాడు. తన మాతృమూర్తిలో లీనమైపోవటం కంటె నా ఛాయమాత్రం ఏం కోరుకుంటుంది? నాతో బయలుదేరిన శత్రువు, మిత్రువు కాలగర్భంలో కలిసిపోతుంటే నేనొక్కణ్ణే ఆలోచనారహితంగా అంటుకుపోయిన గర్భకుహరాన్ని సముదాయిస్తూ ఎంతకాలం గడపగలను? నా అస్థిత్వాన్ని అంతర్ధానం చేసి ఛాయగా మారి చీకటిలో కలిసిపోతే? అస్థిత్వాన్ని ఉద్దీపింపచేసి అరుణకిరణాలలో లీనమయిపోతే? అసంభవమైన సందర్భాలు సంభవమైపోతే? ఈ సృష్టికర్థం ఏముంటుంది? నా ఉనికికి విలువ ఏముంటుంది?

నా ఆలోచనలు నా ఛాయతోపాటు పెరిగి దానితోపాటు అంతమయిపోయినాయి. ఉషస్సుతో బయలుదేరిన నా ఉద్వేగం దినమంతా పయనించి భాస్కరునితోపాటు కనుమరుగయింది. ఈ రాత్రి మళ్ళీ పగలుగా మారుతుంది గదూ! మాయమయిన మిత్రులు మళ్ళీ కలుస్తారు గదూ! కలిసినా విడిపోవటానికేగా! విడిపోతున్నా తిరిగి కలవటానికే! ఈ రాత్రి తిరిగి పగలు కాకుండా ఉంటే నాకు పట్టిన నిద్రకు తిరిగి మెలకువ రాకపోతే ఈ జగత్తంతా సుషుప్తిలో జోగాడుతూ ఉంటుంది. నా ఉనికి అస్థిత్వం పోయి నామరహితమైపోతుంది! ఆ...!! వీల్లేదు. నా అస్థిత్వానికి భంగం రాకూడదు... ఈ జగత్తంతా నా కోసం సృష్టించబడిందే! అనుభవయోగ్యంకాని గాలిమేడలకు మెట్లు కట్టాలి. స్వర్గసౌధానికి నిచ్చెనలు వేసుకోవాలి. ఇవన్నీ నాకోసం నేనే ఉన్నాను... నేనుండాలి... అనుభవించాలి... ఆరుబయట అట్లాగే పడి ఉన్న మంచంమీదకు పరుగెడుతుంటే నాలో ఒక విధమైన భయం బయలుదేరింది. ఈ రాత్రి పగలు కాదేమో! నా నిద్రకు మెలకువ రాదేమో! వీల్లేదు...తెల్లవారవలసిందే.

(తెలుగు స్వతంత్ర - జూన్ 17, 1955)